కష్టాలు.. దాటేదెలా?



మండలంలోని విశ్వనాథపురం నుంచి తానేధార్‌పల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో నాలుగు కిలోమీటర్ల వ్యవధిలోనే రెండు గ్రామాల మధ్య ఆరు కాజ్‌వేలు ధ్వంసమై ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో కాజ్‌వేల నుంచి వరద నీరు వెళ్తుండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళ ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో అప్పటి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అధికారులను ఆదేశించినప్పటికీ పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి హై లెవల్ వంతెనలను నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ రామకృష్ణను వివరణ కోరగా.. వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే పనులు చేస్తామని చెప్పారు.

–న్యూస్‌టుడే, స్టేషన్‌ఘన్‌పూర్

వీధికో నెంబరు పడమటితండా ప్రత్యేకత



సాధారణంగా పట్టణాలు, నగరాల్లోని కాలనీలు, వీధులకు నెంబర్లు, ఇంటి నెంబర్లతో కూడిన ఫలకాలుంటాయి. కానీ జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పడమటితండాలో ఉన్న పది వీధులకు సంఖ్యను చూపుతూ సిమెంటు ఫలకాలు అమర్చారు. ఇక్కడ సుమారు 400 ఇళ్లు, రెండున్నర వేల జనాభా ఉన్నారని పంచాయతీ కార్యదర్శి అశ్విని తెలిపారు. గతంలో లుంబాగాడ్‌నాయక్ అనే వ్యక్తి తన కుటుంబంతో తమ వ్యవసాయ పొలాల వద్ద నివాసాలు ఏర్పాటు చేసుకోగా అప్పటి నుంచి తండాగా అవతరించింది. కొన్ని మండల కేంద్రాల్లోనూ లేని ఫలకాలు ఈ తండాలో ఉండటంతో పనిమీద వచ్చిన పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, దేవరుప్పుల (జనగామ జిల్లా)

మార్పు కోసం.. మన పాలనాధికారులు

వినూత్న ఆలోచనలతో ముందడుగు

ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల్లో పాలనాధికారులు వినూత్న కార్యక్రమాలతో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.. ప్రజల హృదయాలను గెలుచుకుంటున్నారు. పాలనలో తమదైన ప్రత్యేక ముద్ర వేస్తూ కీలకమైన విద్య, వైద్య రంగాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా ములుగు, జనగామ, వరంగల్ పాలనాధికారులు రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా చేపట్టిన కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.



–వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే



దుగ్గొండి బాలుర వసతిగృహంలో ఫిర్యాదుల పెట్టెను తెరుస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ఉన్నతిలో 'కీ'రోల్

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహాలు, కస్తూర్బా విద్యాలయాలు, గురుకులాల్లోని విద్యార్థుల ఉన్నతిపై **వరంగల్ పాలనాధికారి డా.సత్యశారద** దృష్టి సారించారు. వారి సమస్యలు తెలుసుకునేందుకు వసతిగృహాలు, గురుకులాల్లో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటుచేశారు. వాటి తాళాలు ఆమె వద్దే ఉంటాయి. విద్యార్థులు తమ సమస్యలను చీటీల్లో రాసి పెట్టెలో వేస్తున్నారు. ఎవరు ఫిర్యాదు చేశారో వార్డెన్, ఇతర సిబ్బందికి తెలియనీయకుండా.. విద్యార్థుల డార్మెంటరీలలోనే వాటిని ఏర్పాటుచేశారు. ఆకస్మిక తనిఖీల సమయంలో పాలనాధికారి పెట్టెలను తెరిచి సమస్యలు తెలుసుకుంటున్నారు. పరిష్కార దిశగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు. దాంతో వసతిగృహాలు, గురుకులాల సిబ్బంది విద్యార్థులకు అందించే భోజనాలు, శుభ్రతపై అప్రమత్తంగా ఉంటున్నారు. ● ఫిర్యాదుల పెట్టె ద్వారా విద్యార్థులు కోరినట్లు నవంబరు 15 లోగా దుప్పట్లు పంపిణీ చేస్తామని పాలనాధికారి తెలిపారు.



ఆసుపత్రిలో రిజిస్టర్ పరిశీలిస్తూ..



ప్రతి సమస్య నమోదుకు ప్రత్యేక పుస్తకం

హనుమకొండ పాలనాధికారి ప్రావీణ్య వినూత్నంగా ఆలోచించి ఏటీఆర్ (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) బుక్ ఏర్పాటు చేశారు. ఎవరైనా కలెక్టర్ దరఖాస్తు ఇచ్చినా, తాను క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడ ఉన్న సమస్యలేమిటో ఆరా తీస్తున్నారు. వాటిని పరిష్కరించేందుకు ఏం చేయాలి.. తన పరిధిలో చేయొచ్చా.. పై అధికారులతో మాట్లాడాల్సి వస్తుందా... ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా.. ఇలా ప్రతి పనికి సంబంధించి పూర్తి వివరాలతో కలెక్టరేట్‌లో ఏటీఆర్ బుక్‌లో నమోదు చేసి ఆన్ లైన్ చేయిస్తున్నారు. ప్రతి శనివారం సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నారు. ఫలితంగా ఆయా పనులు పరిష్కారం దిశగా సాగుతున్నాయి. ● ఏటీఆర్‌లో నమోదైన సమస్యలపై సమీక్షిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాని పాలనాధికారి ప్రావీణ్య పేర్కొన్నారు. –న్యూస్‌టుడే, హనుమకొండ కలెక్టరేట్

వాట్సప్ హాజరు గ్రూపులతో గైర్హాజరుకు ముకుతాడు



ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరు కావడం లేదని **జనగామ పాలనాధికారి రిజ్వాన్ బాషా** ఆకస్మిక తనిఖీల్లో వెల్లడైంది. దీంతో ఆయన తనతో పాటు డీఎంహెచ్‌ఓ, ఇతర వైద్యాధికారులు, అన్ని పీహెచ్‌సీల వైద్యులు, అన్ని విభాగాల సిబ్బందితో ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ సీహెచ్‌సీల్లో ప్రతి రోజూ విధులకు హాజరయ్యే వైద్య, సిబ్బంది విధుల్లోకి వచ్చిన, వెళ్తున్న సమయంలో ఆ గ్రూప్‌లో ఫొటో పోస్టు చేసేలా చర్యలు చేపట్టారు. ఆ రోజు ఎంత మందికి ఓపీ చూశారు, ఎంత మంది ఇన్‌పేషెంట్లకు వైద్యం చేశారనే వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ గ్రూప్‌ను డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్ పర్యవేక్షిస్తుంటారు. పాలనాధికారి కూడా ప్రతి రోజూ పీహెచ్‌సీల వారీగా పరిశీలిస్తూ తన అభిప్రాయాలను పోస్టు చేస్తున్నారు. పాలనాధికారే గ్రూప్‌లో ఉంటూ గమనిస్తుండటంతో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య, సిబ్బంది మెరుగైన హాజరు కనిపిస్తోంది.



విధుల్లో ఉన్నామంటూ వాట్సప్ గ్రూపులో వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

పాఠశాలల్లో సైతం: జులైలో 600 మంది ఉపాధ్యాయులు సెలవులు పెట్టారని తెలుసుకున్న పాలనాధికారి విద్యాశాఖలోనూ ప్రక్షాళన ప్రారంభించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయించారు. రోజూ హాజరు శాతం పోస్టు చేసేలా చర్యలు చేపట్టారు.

● రాష్ట్రంలో జనగామను ఆదర్శ జిల్లాగా ముందు వరుసలో ఉంచాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పాలనాధికారి రిజ్వాన్ బాషా తెలిపారు.

–న్యూస్‌టుడే, జనగామ టౌన్

కంటెయినర్ ఆసుపత్రితో చేరువైన వైద్యం, విద్య



ములుగు జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల ప్రజలు సరైన రహదారి లేక అవస్థలు పడుతుంటారు. వర్షాకాలం విద్య, వైద్యం అందని పరిస్థితులు. **ములుగు పాలనాధికారిగా టీఎస్ దివాకర** జూన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. మంత్రి సీతక్క ఇక్కడి సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని ఆయన్ను కోరారు. ఆయన జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శించి కంటెయినర్ ఆసుపత్రి ఆలోచనను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సూచనలతో తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలో కంటెయినర్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్(కంటెయినర్ ఆసుపత్రి) ఏర్పాటు చేయించారు. నర్సాపూర్, అల్లిగూడెం, బందాల, బొల్లెపల్లి గ్రామాలకు కూడా దీని ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. వాజేడు మండలం ఎడ్జర్లపల్లిలోనూ ఏర్పాటు చేయించారు. రూ.7 లక్షలు వెచ్చించి తయారు చేయించారు. ఇందులో నాలుగు పడకలు ఉంటాయి. ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, హెల్త్ అసిస్టెంటు వైద్య సేవలందిస్తున్నారు.

ఇదే స్ఫూర్తితో పాఠశాల..: కన్నాయిగూడెం మండలం బంగారుపల్లి గొత్తికోయ గూడెంలో రూ.13 లక్షలతో పాఠశాల కోసం కంటెయినర్‌ను ఏర్పాటు చేశారు. సోలార్ విద్యుత్తు, డ్యూయెల్ డెస్కులు, ఫ్యాన్లు, నల్లబోర్డు, తదితర వసతులున్నాయి.



కంటెయినర్ బడిలో చదువుకుంటున్న విద్యార్థులు

● రవాణా సౌకర్యం లేని గ్రామాల్లో సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని పాలనాధికారి దివాకర తెలిపారు.

–ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి

విద్యార్థిపై మంత్రాల నెపం

పెంబర్తి ఆశ్రమ పాఠశాలలో ఘటన

జనగామ, న్యూస్‌టుడే: శాస్త్రీయ భావనలు పెంపొందించి విద్యాబుద్ధులు నేర్పించాల్సింది పోయి, మంత్రాల నెపంతో ఓ విద్యార్థిపై తోటి మిత్రులు ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేయగా, సదరు విద్యార్థిని ఇంటికి పంపించిన దారుణం జనగామ జిల్లాలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థి తండ్రి, ఇతర వర్గాల నుంచి సేకరించిన వివరాలిలా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి ఒకరు జనగామ మండలం పెంబర్తిలోని మహాత్మా జ్యోతిబా పులే ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. దసరా పండగ సెలవులకు ముందు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రిన్సిపల్ సమావేశం నిర్వహించారు. అనంతరం సదరు విద్యార్థి తండ్రితో ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. 'మీ కుమారుడు మంత్రాలు చేస్తున్నాడని, 8, 9వ తరగతి విద్యార్థులు ఫిర్యాదు చేశారని' బాలుడిని తీసుకువెళ్లాలని పంపించారు. తర్వాత ప్రిన్సిపల్ నుంచి ఎలాంటి పిలుపు రాకపోవడంతో, కొడుకు భవిష్యత్తు ప్రశ్నార్థకమైందని కుటుంబ సభ్యులంతా ఆవేదన చెందామని తండ్రి వాపోయారు. టీసీ గురించి అడిగితే రెండు మూడు రోజులు ఆగాలని చెప్పారన్నారు. ఒక వేళ తమ కుమారుడి ప్రవర్తన వింతగా ఉంటే ఇలా వ్యవహరించడం సరికాదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తండ్రి చెప్పారు. ఈ విషయమై ప్రిన్సిపల్‌ను వివరణ కోరగా.. విద్యార్థి తమను బెదిరిస్తున్నాడని సీనియర్లు తెలిపారు. అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. వైఖరిలో మార్పు రాకపోవడంతో సీనియర్లు గత నెల 23న లిఖిత పూర్వక ఫిర్యాదు చేయగా, తల్లిదండ్రుల సమక్షంలో మాట్లాడామన్నారు. మిగతా 500 మంది విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడగా, టీసీ ఇవ్వాలని కోరి వెళ్లిపోయారని, తాను ఇబ్బంది పెట్టింది ఏం లేదని పేర్కొన్నారు.

కొంపముంచిన షికారు



కారులో నుంచి బయటకు దూకుతున్న యువకుడు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని బతుకమ్మకుంటలోకి ఓ కారు అకస్మాత్తుగా దూసుకెళ్లిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ దామోదర్‌రెడ్డి, స్థానికుల కథనం ప్రకారం.. జఫర్‌గఢ్‌కు చెందిన యాకుబ్, పాలకుర్తి మండల గూడూరుకు చెందిన ఆదాంలు స్నేహితులు. యాకుబ్‌కు ఆదాం బతుకమ్మకుంటలో డ్రైవింగ్ నేర్పిస్తున్న క్రమంలో యాకుబ్ నియంత్రణ కోల్పోవడంతో కారు పక్కనే ఉన్న కుంటలోకి దూసుకెళ్లింది. సమీపంలోని ప్రజలు అప్రమత్తమై కేకలు వేశారు. అందులో మిత్రులు ఇద్దరు వెంటనే దూకగా, ఇరువురిని అక్కడే ఉన్న మరో వ్యక్తి కాపాడి, ఒడ్డుకు తీసుకొచ్చారని, ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని సీఐ తెలిపారు. అనంతరం క్రేన్ సాయంతో నీటిలోని కారును బయటకు తీశామని పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని వివరించారు.

పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఒకరి ఆత్మహత్యాయత్నం

ఎస్సై, కానిస్టేబుల్‌కూ గాయాలు

పాలకుర్తి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. తండావాసులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకుర్తి మండలం కొండాపురం పంచాయతీ పరిధిలోని మేకలతండాకు చెందిన లకావత్ శ్రీను(22)కు అదే మండలం నర్సింగాపురంతండాకు చెందిన రాధికతో ఆరు నెలల కింద వివాహమైంది. కొద్ది రోజులు సాఫీగా సాగిన వీరి వైవాహిక జీవితం మనస్పర్థలు రావడం, గర్భవతి కావడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇరువురికి తెలిసిన పెద్ద మనుషులు నచ్చజెప్పే ప్రయత్నం చెప్పినా కొలిక్కి రాకపోవడంతో శ్రీను పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును పోలీసులు పట్టించుకోవడం లేదని భావించి, శుక్రవారం మధ్యాహ్నం ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆపే ప్రయత్నం చేసిన ఎస్సై సాయిప్రసన్నకుమార్, కానిస్టేబుల్ రవీందర్‌కూ తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన సీఐ మహేందర్‌రెడ్డి శ్రీనుని, పోలీసులను పాలకుర్తి ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన చికిత్సకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. శ్రీను శరీరం 70 శాతం కాలిపోవడంతో పరిస్థితి విషమించినట్లు తెలిసింది. స్టేషన్‌ను డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ నర్సయ్య సందర్శించి, ఘటనపై ఆరా తీశారు.



లకావత్ శ్రీను





గాయపడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్న ఎస్సై సాయిప్రసన్నకుమార్, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



జనగామ, న్యూస్‌టుడే: జిల్లా పాలనాధికారి రిజ్వాన్‌బాషా ఆదేశాలను అనుసరించి జనగామ జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ మార్కెట్ పరిధిలో హరిహర, సిరికాటన్‌మిల్, రామలింగ, సత్యసాయి, స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ పరిధిలో శివసాయి కాటన్ మిల్లుల్లో కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. రైతులు నిర్దేశిత తేమ శాతం మించకుండా, నాణ్యమైన పత్తిని విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, ఛైర్మన్ శివరాజ్‌యాదవ్, ఆయా కమిటీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ పెండింగ్ కేసులు పరిష్కరించాలి



జిల్లా సచివాలయంలో సమీక్ష సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ రిజ్వాన్‌బాషా, తదితరులు

జనగామ, న్యూస్‌టుడే: నెలరోజుల్లో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ పెండింగు కేసులను పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య కోరారు. శుక్రవారం జనగామ జిల్లా సచివాలయంలో జరిగిన షెడ్యూల్డు కులాలు, తెగల భూ సమస్యలను, వేధింపుల కేసుల స్థితి గతులపై కలెక్టర్ రిజ్వాన్‌బాషాతో కలిసి ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ.. కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని రెవెన్యూ, పోలీసు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని మూడు మాసాలకోసారి తప్పక నిర్వహించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, హక్కుల పరిరక్షణకు యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కేసులకు సంబంధించి కక్షిదారులకు చెల్లింపుల విషయంలో జాప్యం లేకుండా చూస్తున్నామన్నారు. భారతీయ న్యాయ సంహిత ప్రకారం వారికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. సమావేశంలో డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, కమిషన్ సభ్యులు రాంబాబునాయక్, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, లక్ష్మీనారాయణ, అధికారులు విక్రమ్, మాధవిలత, ప్రేమకళ, ఏసీపీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి

నర్మెట్ట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా, కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై హన్మంతాపూర్, కన్నెబోయినగూడెం, వెల్దండ, అమ్మాపురం, గండిరామవరం, ఆగపేట బడుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం పలువురికి సభ్యత్వ రశీదులను అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శులు ఎన్ఎన్ రాజు, కొయ్యాడ శ్రీరాములు, ప్రతినిధులు రమేష్, కనకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



గండిరామవరంలో సభ్యత్వ రశీదులను అందజేస్తున్న శ్రీనివాస్

పకడ్బందీగా ఆరోగ్య కార్యక్రమాల అమలు



వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జేడీ డాక్టర్ రాజేశం, చిత్రంలో డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల అమల్లో ప్రోగ్రాం అధికారులంతా అంకితభావంతో పని చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్(టీబీ, మెటర్నల్ హెల్త్) డాక్టర్ రాజేశం సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని సందర్శించి ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్, ఇతర వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ రోగులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో వైద్య సేవలందించాలి..

జనగామ టౌన్: జిల్లా జనరల్ ఆసుపత్రిలోని పాలియేటివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న రోగులకు అంకితభావంతో వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవీందర్‌గౌడ్ సూచించారు. పాలియేటివ్ కేర్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ క్యాన్సర్, పక్షవాతంతో పాటు ఇతర అవసాన దశలో ఉన్న రోగుల కోసం పాలియేటివ్ కేర్ సేవలందిస్తోందన్నారు. వైద్య సిబ్బంది ఆత్మీయతతో వారికి సేవలందించేలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్, వైద్యులు డాక్టర్ అనురాధ, లక్ష్మీనారాయణ, మాస్ మీడియా అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని చెక్‌డ్యాంలు



జనగామ మండలం సర్వాయి పాపన్న చెరువు వద్ద చెక్‌డ్యాం దెబ్బతినడంతో వృథాగా పోతున్న నీరు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: కరవు దుర్భిక్ష ప్రాంతమైన జనగామకు ఏటేటా సాగునీటి కొరత తప్పడం లేదు. వరుణుడు కరుణించని సమయాల్లో నీటి కొరత ఏర్పడటమే కాదు.. వర్షాలు సమృద్ధిగా కురిసిన ఆయా కాలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యమే ప్రధానంగా నిలుస్తోంది. జనగామ మండలం గానుగుపహాడ్ గ్రామ పరిధిలో చెరువులు లేవు.. ఉన్నదల్లా ఒక్క వాగు మాత్రమే. దీని ద్వారానే బోర్లు, బావులకు 50 శాతం మేర భూగర్భ జలాల పెంపునకు దోహదపడుతోంది. ఈ వాగుపై గత 20 ఏళ్ల క్రితం ఆరు చెక్ డ్యాంలను నిర్మించారు. కొన్నేళ్ల పాటు భూగర్భ జలాలకు కొదవలేకుండా పోవడం.. సుమారుగా 6-7వేల ఎకరాల్లో వరి పంట సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. గత 10 ఏళ్ల క్రితం కురిసిన భారీ వానలకు ఆనకట్టలు కొన్ని చోట్ల పాక్షికంగా, మరికొన్ని చోట్ల పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఆయా చెక్‌డ్యాంలలో నీరు నిల్వని పరిస్థితి. ప్రస్తుతం వానాకాలంలో ఇబ్బందులు లేకున్నా, యాసంగి నాటికి తీవ్ర కొరత ఏర్పడుతోంది. మండలంలోని వెంకిర్యాల, గానుగుపహాడ్, వడ్లకొండ గ్రామాల మీదుగా సుమారు 6-7వేల ఎకరాల్లో వరికి ప్రత్యక్షంగా, పరోక్షంగా నీరందుతోంది. బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి నీటిని వదిలితే తప్ప సాగునీటి కొరత లేకుండా ఉంటుంది. వాగుపై సుమారుగా 10 వరకు చెక్‌డ్యాంలను నిర్మిస్తే కొరత పూర్తిగా తీరుతుందని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.


ప్రతిపాదనలు పంపాం..

- కమలాకర్, బొమ్మకూరు రిజర్వాయర్ కుడి కాలువ ఏఈ

దెబ్బతిన్న చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వ నిధుల కేటాయింపు నిబంధనల్లో లేవు. కొత్తవి నిర్మించేందుకు మాత్రమే అవకాశం ఉంది. గానుగుపహాడ్ పరిధిలోని వాగుపై రెండు ప్రాంతాల్లో చెక్‌డ్యాంలను నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం.

రామప్ప.. సకల కళల సమ్మేళనం..!

వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణలో కొత్త ఆలోచనలకు స్వాగతం



యునెస్కో గుర్తింపు పొందిన కట్టడాల ప్రాముఖ్యాన్ని ప్రపంచస్థాయిలో మరింత ప్రచారం చేయడానికి యునెస్కో.. ఏటా వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది. ఈనెల 15 నుంచి 26 వరకు 12 రోజుల పాటు రామప్పలో జరుగుతోంది. ఈ కార్యక్రమ నిర్వహణకు మే నెలలోనే దరఖాస్తులు స్వీకరించింది. 243 మంది దరఖాస్తు చేసుకోగా.. 40 మందిని ఎంపిక చేసింది. వీరితో పాటు యువ టూరిజం పేరుతో ఈ శిబిరానికి మరో 40 మందికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అవకాశం కల్పించింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాలంటీర్లతో మాట్లాడి 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

–వెంకటాపూర్, న్యూస్‌టుడే

మనకు గర్వకారణం.. రామప్ప ఆలయం.. 800 ఏళ్ల చరిత్ర. ఎన్నో ప్రకృతి విపత్తులను ఎదుర్కొని యునెస్కో గుర్తింపు పొంది ఓరుగల్లుకు గర్వకారణంగా నిలిచింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల పరిధిలోని ఈ రాతి కట్టడం నిర్మాణశైలి నేటి తరానికి ఎన్నో ఆలోచనలను రేకెత్తిస్తోంది. అయోధ్య రామమందిర పునాదిలో రామప్ప సాండ్‌బాక్సు టెక్నాలజీ వాడారంటే ఆనాటి సాంకేతిక పరిజ్ఞానం ఎంత గొప్పదో తెలుస్తోంది..

కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన టూరిజం, చరిత్ర, ఆర్కియాలజీ, ఆర్కిటెక్చర్, కళలు, సివిల్ ఇంజినీరు విభాగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులు వాలంటీర్లుగా శిక్షణ పొందుతున్నారు.



శిక్షణ బృందం

కేరళ..

సామాజిక మాధ్యమాల్లో తెలుసుకుని..



కేరళ యూనివర్సిటీ ఆర్కియాలజీ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న సంజయ్ మూడేళ్ల నుంచి కాలభైరవునిపై పరిశోధన చేస్తున్నారు. భారత దేశంలో ఉన్న ఆలయాలను స్వయంగా వెళ్లి చూడటం.. వాటి ప్రత్యేకతలు తెలుసుకోవడం ఆయనకు అభిలాష. సంజయ్ సందర్శించిన ఆలయాలు చాలావరకు శిథిలావస్థకు చేరుకున్నవి కూడా ఉన్నాయి. వందల ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉండి, ఆనాడే అద్భుత సాంకేతికతను వాడడం, తెలుగు రాష్ట్రాల నుంచి యునెస్కో గుర్తింపు పొందిన ఏకైక కట్టడం రామప్ప అని సామాజిక మాధ్యమాల్లో తెలుసుకున్నారు. వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణకు దరఖాస్తు చేసుకుని ఎంపికయ్యారు.

● రామప్పకు చేరుకోగానే శిలాశాసనం, చరిత్ర గురించి ఆరా తీశారు. ఆయన పరిశీలించిన ఆలయాల్లో రామప్పకు గొప్ప ప్రత్యేకత ఉందని, వాడిన సాంకేతిక పరిజ్ఞానం మరెన్నో కట్టడాల పునర్నిర్మాణానికి ఉపయోగకరంగా ఉందని ఇతరులకు తెలియజేయడానికి నిత్యం సామాజిక మాధ్యమాల ద్వారా చర్చిస్తున్నారు.

తమిళనాడు

సదస్సులకు వెళ్తూ.. స్వయంగా పరిశీలిస్తూ




టీఎన్ఎస్ డీఏ పీజీ డిప్లొమాలో ఇంజినీరింగ్ చేస్తున్న విజయరాజ్‌ది తమిళనాడు. దేశవ్యాప్తంగా వారసత్వ కట్టడాలకు సంబంధించిన సదస్సులకు హాజరవ్వడం మక్కువ. ఫేస్‌బుక్‌లో చూసిన పోస్టును ఆధారం చేస్తుకుని వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం-3కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు ప్రొఫెసర్ పాండురంగారావు సూచనల మేరకు తమిళనాడు నుంచి తన నలుగురు మిత్రులతో కలిసి రామప్పకు వచ్చారు.

● కాకతీయులు నిర్మించిన ఆలయాల ప్రత్యేకత గురించి శిబిరంలో నేర్చుకుంటున్నారు. ప్రొఫెసర్లు వివరించే తీరు, ప్రత్యక్షంగా చూపించే పద్ధతి ఎంతో ఉపయోగకరంగా ఉందంటూ చెప్పారు. శిక్షణలో కొత్త ఆలోచనలు పంచుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్

ప్రకృతి ప్రతిరూపమే.. పర్యాటకం



ప్రకృతి రూపమైన పర్యాటకాన్ని ప్రపంచ నలుమూలలా చాటేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకు చెందిన జ్ఞానకళ బీబీఏ టూరిజం విభాగంలో పరిశోధనలు చేస్తున్నారు. లెజర్ టూరిజం, అడ్వెంచర్, ఫుడ్స్, గుళ్లగోపురాలకు సంబంధించిన పర్యాటక మెలకువలను నేర్చుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు.

● పర్యాటక ప్రదేశాలకు వెళ్లిరావడం కాదని, అక్కడ చూసిన, తెలుసుకున్న విషయాలపై అవగాహన పెంచుకొని పలువురికి తెలియజేయాలని వాట్సాప్, ఫేస్‌బుక్ వేదికలుగా వేలాది మందికి అవగాహన కల్పిస్తున్నారు. శిబిరంలో ఏర్పాటు చేసిన బృందాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రామప్ప అద్భుత శిల్పాల గురించి ప్రపంచవ్యాప్తంగా తెలియజేయడంలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు..

తెలంగాణ

టూరిజం క్లబ్‌లో స్థానం దక్కించుకుని..



చరిత్రను అభ్యసించేవారు తగ్గిపోతున్న ఈ రోజుల్లో వరంగల్ పింగిళి కళాశాల హిస్టరీ ప్రొఫెసర్ శ్రీనివాస్ ప్రోత్సాహంతో స్వప్న బీఏ(చరిత్ర) చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టూరిజం క్లబ్(యువటూరిజం)లో స్థానం దక్కించుకుని వాలంటీర్ శిక్షణకు ఎంపికయ్యారు.

● కాకతీయ కట్టడాల చరిత్ర అంటే అంతా ఒకేలా ఉంటుందని అనుకున్న ఆమె రామప్పకు చేరుకున్న తర్వాత ఆలయంలోని రాగిని, నాగిని శిల్పాలు, పొన్న చెట్టుపై ఉన్న శ్రీకృష్ణుడు సత్యభామ చీర లాగడం, శిల్పాలను మీటితే సరిగమపదనిసలు రావడం, క్షీరసాగరమథనం, శివపార్వతుల కళ్యాణం, నరకాసురవధ లాంటి పురాణ హితిహాసగాథలు, భూకంపాలను తట్టుకునే విధంగా కట్టిన ఆలయ నిర్మాణాన్ని చూసి అబ్బురపడిపోయారు. దేశంలోని చరిత్రలకే కాకతీయుల చరిత్ర పునాదిగా నిలిచిందంటున్నారు.



హనుమకొండ జిల్లాలోని ఓ క్వారీలో తవ్వకాలు

ఇక్కడా ఉన్నారు ఘనులు

● కరుగుతున్న గుట్టలు.. తరలుతున్న మొరం

గనుల మేతలో ఆరితేరిన లీజుదారులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన తవ్వకాలు జరుగుతున్నాయి. జనగామ జిల్లా మైనింగ్ శాఖ ఏడీ విజయ్‌కుమార్ ఇటీవల సస్పెండ్ అయ్యారు.. ఆయన మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేసినప్పుడు స్థిరాస్తి వ్యాపారులకు సహకరించి అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై విచారణ జరిపి ప్రభుత్వం ఆమేరకు నిర్ణయం తీసుకుంది.. ఉమ్మడి జిల్లాలోనూ గ్రానైట్, మట్టి తవ్వకాల్లో రూ.కోట్లల్లో అక్రమాలు జరిగింది. ఇక్కడ సైతం పూర్తిస్థాయిలో విచారణ చేపడితే అవినీతి అధికారులపై వేటు పడే అవకాశం ఉంది.

–ఐనవోలు (హనుమకొండ), న్యూస్‌టుడే

'ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా గనుల తవ్వకాల కోసం అనుమతులు పొందినవి 1,276 కాగా, అక్రమంగా తవ్వకాలు చేపట్టేవి 430కి పైగా ఉన్నట్లు గుర్తించారు.'

'వరంగల్ గ్రానైట్‌ను దేశంలో అనేక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. క్వారీల నుంచి బ్లాక్, టాన్ బ్రౌన్, టాన్ రెడ్, టాన్ బ్లూ గ్రానైట్ అధికంగా లభిస్తుంది.'

టాస్క్‌ఫోర్స్

ప్రభుత్వ ఆదేశాలతో విచారణ జరిపిన అధికారులు గనుల తవ్వకాల్లో భారీగా సీనరేజి ఎగవేత జరిగిందని గుర్తించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో లీజుదారులకు నోటీసులు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సైతం 80 మందికిపైగా లీజుదారులకు నోటీసులు అందజేసి జరిమానా విధించారు. దీంతో కొంతమంది క్వారీలు మూసివేశారు.

పంట పొలాలు.. వెంచర్లుగా: స్థిరాస్తి వ్యాపారం సజావుగా కొనసాగాలంటే అనుమతులతో పాటు భూమి చదునుగా ఉండటం ముఖ్యం. ఇందుకు ప్రధానంగా మొరం అత్యంత అవసరం. గ్రేటర్ వరంగల్ నగరం చుట్టూ ధర్మసాగర్, ఆత్మకూరు, ఐనవోలు, దామెర, హసన్‌పర్తి మండలాల్లో 109 గ్రానైట్, మొరం క్వారీలు ఉన్నాయి. ఇందులోని మొరాన్ని స్థిరాస్తి వ్యాపారానికి వినియోగిస్తున్నారు. అధికారులు ఇచ్చే అరకొర అనుమతులతో గ్రానైట్, మట్టి, ఇసుక తవ్వకాల్లో అనుమతులకు భిన్నంగా లీజుదారులు తోడేస్తున్నారు. నగరానికి వేలాది టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. అధికారులు, లీజుదారులు, వ్యాపారులు కుమ్మక్కై చేతివాటం చూపడంతో వేలాది వ్యవసాయ భూములు వెంచర్లుగా వెలుస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

● కాజీపేట నుంచి వరంగల్ వెళ్లే బైపాస్ ప్రధాన మార్గం భట్టుపల్లి రెవెన్యూ పరిధిలో రహదారికి ఆనుకొని ఉన్న 18 ఎకరాల భూమి రోడ్డుకు 10 ఫీట్ల లోతులో ఉండేది. ఆ భూమికి ఎదురుగా ఓ కార్పొరేట్ పాఠశాల, కళాశాల ఏర్పాటు చేయగా ఆ ప్రాంత భూముల ధరలకు రెక్కలొచ్చాయి. లోతట్టులో ఉన్న భూమిని రహదారికి సమాంతరంగా చేయాలని ఆ భూమి యజమాని భావించారు. గత పాలకులు, అధికారుల సహకారంతో కొండపర్తి, వనమాలకనపర్తి, తరాలపల్లి క్వారీల నుంచి 4 వేలకుపైగా టిప్పర్ల ద్వారా 80 వేల మెట్రిక్ టన్నుల మొరం తరలించి రోడ్డుకు సమాంతరంగా భూమిని చదును చేశారు.

● హైదరాబాద్ -వరంగల్ జాతీయ ప్రధాన రహదారిలో రాంపూర్ రెవెన్యూ పరిధిలో అనుమతులు తీసుకుని 30 ఎకరాల్లో ఏర్పాటు చేసి ఓ లేఅవుట్, వరంగల్-ఖమ్మం జాతీయ ప్రధాన రహదారిలో పున్నేలు రెవెన్యూ పరిధిలో 25 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వెంచర్, దేవన్నపేట, మడిపల్లి రెవెన్యూ పరిధిలో 40 ఎకరాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్ల భూముల్లోకి వేలాది టిప్పర్ల ద్వారా మొరం తరలించారు. మొత్తంగా రూ.8 కోట్లకు పైగా మొరం తరలింపులో అధికారుల పాత్ర ఉందని ఆరోపణలు ఉన్నాయి.

ధర్మసాగర్ మీదుగానే గూడ్స్ లైన్ బైపాస్

● నష్కల్ నుంచి చింతలపల్లికి మరోటి

కాజీపేట, న్యూస్‌టుడే: హసన్‌పర్తి రోడ్డు నుంచి ధర్మసాగర్ మీదుగా నష్కల్ వరకు గూడ్సు బైపాస్ లైను నిర్మాణానికి రైల్వే శాఖ అడుగులు వేస్తోంది. తాజాగా ఈ మార్గంలో 24.55 కి.మీటర్ల మేర భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే ధర్మసాగర్ రైతులు బైపాస్ లైను మార్గం మార్చాలని కోరుతున్నారు. ముందుగా పెండ్యాల నుంచి 163వ జాతీయ రహదారి పక్కనుంచి లైన్‌ను ప్రతిపాదించారు. తర్వాత బైపాస్ మార్గాన్ని మార్చుతూ రైల్వే నిర్ణయం తీసుకుంది. కొందరు పెద్దల ఒత్తిడే దీనికి కారణమంటూ ధర్మసాగర్ రైతులు ఆరోపిస్తున్నా.. రైల్వే శాఖ ధర్మసాగర్ మీదుగానే బైపాస్ నిర్మాణానికి సిద్ధమైంది. భూసేకరణ కోసం జనగామ, హనుమకొండ జిల్లాల్లోని ధర్మసాగర్, హసన్‌పర్తి, చిల్పూర్ రెవెన్యూ అధికారులకు నోటిఫికేషన్ అందించింది. దీంతో పాటు నష్కల్ నుంచి మామునూరు మీదుగా గీసుకొండ మండలం చింతల్ రైల్వే స్టేషన్ వరకు మరో బైపాస్‌ను ప్రతిపాదించింది. గూడ్సురైళ్లను బైపాస్‌ల మీదుగా పంపించి కాజీపేట, వరంగల్ స్టేషన్లలో ప్రయాణికుల రైళ్ల రాకపోకలకు సుగమం చేయడానికి ఈ రెండు మార్గాలను ప్రతిపాదించింది. బల్లార్షా- కాజీపేట మార్గంలో గూడ్సు రైళ్ల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండటం వల్ల ఈ మార్గంలో ముందస్తుగా నిర్మాణం చేయాలని భావిస్తోంది.

వంతెన నిర్మాణానికి ప్రణాళిక.. : హసన్‌పర్తి రోడ్డు - నష్కల్ స్టేషన్ల మధ్య నిర్మించే బైపాస్ లైన్ నష్కల్ లేదా పెండ్యాల వద్ద 163వ జాతీయ రహదారిని క్రాస్ చేయాల్సి ఉంటుంది. అలాగే బైపాస్ వల్ల ఎక్కువగా ధర్మసాగర్ గ్రామస్థులు, రైతులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. అందుకని ఈ రెండు చోట్ల వంతెనల నిర్మాణం కోసం రైల్వే అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.



రైల్వే శాఖ విడుదల చేసిన రూట్‌మ్యాప్

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు అన్ని కులాల వధూవరులకు 'ఈనాడు' పెళ్లిపందిరి. నెట్ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



జనగామ, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు' పెళ్లిపందిరి.నెట్ అన్ని కులాల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. జనగామలోని శ్రీచెన్నకేశవ స్వామి దేవాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు, సంబంధిత కుటుంబీకులు నేడు అనగా శనివారం(19 అక్టోబరు 2024) మరియు ఆదివారం (20 అక్టోబరు 2024) నాడు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలిచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు దిగువన పేర్కొన్న వాట్సప్ ఫోన్ నెంబర్లకు పంపవచ్చు. మరిన్ని వివరాలకు 8314445190, 8008002165 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.



సమస్యలు బోలెడు..

కొత్త వీసీపై ఆశలు

కాకతీయ విశ్వవిద్యాలయం ఉప కులపతిగా నియమితులైన విశ్రాంత ఆచార్యులు కర్నాటి ప్రతాప్‌రెడ్డికి ఇక్కడి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇటు విద్యార్థులు, అటు ఆచార్యులు, అధ్యాపకులు ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

విద్యానగర్, కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే

వేతనాలకే చాలని నిధులు..

ఉత్తర తెలంగాణలో విద్యా కేంద్రంగా విరాజిల్లుతున్న కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడ పని చేస్తున్న వెయ్యి మంది బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలకు ఏడాదికి రూ.150 కోట్లు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బ్లాక్ గ్రాంట్ కింద వస్తున్న రూ.97 కోట్లు వేతనాలకు సరిపోక.. ఏటా రూ.53 కోట్ల నిధులు అంతర్గత సమీకరణల ద్వారా సమకూర్చుకుంటున్నారు. నిధులు లేక అభివృద్ధి అటకెక్కింది. తక్షణం నిధుల సేకరణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వేధిస్తున్న అధ్యాపకుల కొరత..

విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధనలను ప్రగతి పథంలో పరుగులు పెట్టించాలంటే అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకం. వర్సిటీలో ప్రస్తుతం బోధన అంతా ఒప్పంద, తాత్కాలిక అధ్యాపకులతోనే సాగిస్తున్నారు. మొత్తం 405 రెగ్యులర్ అధ్యాపక పోస్టులు ఉండగా.. అందులో 83 మంది మాత్రమే పని చేస్తున్నారు. మరో 190 మంది ఒప్పంద, 201 మంది తాత్కాలిక అధ్యాపకులు బోధిస్తున్నారు. కొత్తగా ప్రవేశ పెట్టిన కోర్సులతో కలిపి సుమారు వెయ్యి మంది వరకు అధ్యాపకులు ఉండాలి. వారి నియామకాలే పెద్ద సమస్యగా మారింది.



నిధులు లేక నిరుపయోగంగా ఉన్న కె-హబ్

మరిన్ని..

● విశ్వవిద్యాలయంలో మొత్తం 14 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో బాలురకు సరిపడా ఉన్నా.. బాలికలకు వసతి కొరత ఉంది.

● కబ్జాకు గురైన కేయూ భూములను స్వాధీనం చేసుకోవడంపై దృష్టి పెట్టాలి. మిగతా స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మాణం అవసరం.

● పీహెచ్‌డీ ప్రవేశాలపై కొనసాగుతున్న వివాదం

15వ ఉప కులపతిగా కర్నాటి ప్రతాప్‌రెడ్డి



విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉప కులపతిగా కర్నాటి ప్రతాప్‌రెడ్డి రానున్నారు. ఆయనకు 32 సంవత్సరాలకు పైగా బోధన, 37 సంవత్సరాల పరిశోధన అనుభవం ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సైన్స్ డీన్‌గా పనిచేసి 2021లో ఉద్యోగ విరమణ పొందారు. కాకతీయ విశ్వవిద్యాలయానికి వ్యక్తిపరంగా 13వ, పదవీ కాలం పరంగా చూస్తే 15వ ఉప కులపతి అవుతున్నారు. గతంలో ఆచార్య జాఫర్ నిజాం, ఆచార్య టి.వాసుదేవ్ రెండుసార్లు వీసీగా పని చేశారు. ఆచార్య టి.రమేశ్ పదవీ కాలం ఈ ఏడాది మార్చి 21న ముగిశాక ఇప్పుడు రెగ్యులర్ వీసీ నియామకం అయ్యారు.

ఇదీ ప్రస్థానం

● కర్నాటి ప్రతాప్‌రెడ్డిది రంగారెడ్డి జిల్లా యాచారం. 1981లో బీఎస్సీ (హానర్స్) జంతుశాస్త్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పట్టా పొందారు. అదే విశ్వవిద్యాలయం నుంచి 1983లో జంతుశాస్త్రం, న్యూరోబయాలజీ నుంచి పీజీ పట్టా తీసుకున్నారు. 1988లో జంతుశాస్త్రం, న్యూరోబయాలజీ లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారు.. ముఖ్యంగా

● 2016 నుంచి 2018 వరకు జంతుశాస్త్ర విభాగాధిపతిగా, 2018 నుంచి 2020 వరకు విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, 2020 నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సైన్స్ డీన్‌గా సమర్థంగా పనిచేశారు. 2021లో ఉద్యోగ విరమణ చేశారు. తన ఉద్యోగ ప్రస్థానంలో 104 జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలు ప్రచురించారు. 87 జాతీయ, అంతర్జాతీయ పరిశోధన, ప్రదర్శనలు చేశారు. 10 ప్రాజెక్టులు పూర్తి చేశారు. 7 పుస్తకాలను రచించారు. 25 మందికి పరిశోధన పర్యవేక్షకుడిగా పని చేశారు.

రహదారిపై అరకొర వెలుగులు



వంతెనపై వెలగని ప్రత్యేక లైట్లు, ఫ్లడ్‌లైట్లు



నెహ్రూపార్కు విభాగిని వద్ద..

జనగామ, న్యూస్‌టుడే: పట్టణ సుందరీకరణలో భాగంగా స్థానిక రహదారి వంతెనపైన, నెహ్రూపార్కు నుంచి బస్టాండు విభాగిని వెంట మార్చి 2023లో ఏర్పాటు చేసిన ప్రత్యేక దీప తోరణాలు(లెడ్ స్ట్రిప్‌రోప్ లైట్స్) సగానికి సగం వెలగడం లేదు. ప్రమాదకరంగా మారిన వంతెనపై 16 స్తంభాలకు ఈ దీపాలు వెలగడం లేదు. ఇక వంతెన మధ్య భాగం నుంచి జిల్లా ఆసుపత్రికి వెళ్లే మార్గంలోనూ అనేక స్తంభాలకు ఫ్లడ్‌లైట్లు సైతం వెలగకపోవడంతో అరకొర వెలుతురులో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

రోడ్డు కోతకు గురై.. ప్రమాదకరంగా మారి..



నర్మెట్ట-వెల్దండ రహదారిలోని ప్రధాన కెనాల్ సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు కట్టపైన రోడ్డు నుంచి నీరు ప్రవహించడంతో పక్కన పెద్ద గుంత ఏర్పడింది. ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. రాత్రిళ్లు ప్రయాణికులు ఏమరుపాటుగా ఉంటే కిందపడే ఆస్కారం ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని గుంతను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నర్మెట్ట**

అక్కాతమ్ముళ్లు 'కథలు' భద్రపరుస్తున్నారు!



అపర్ణ, తొమ్మిదో తరగతి



మనోజ్, ఏడో తరగతి

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: దినపత్రిక కనిపించగానే ఎవరికి నచ్చిన కథనాలు, వార్తలను వారు చదివి, పక్కన పెట్టేస్తారు. కానీ అందులో వచ్చిన కథలను చదివి మరో పదిమందికి అందుబాటులోకి తేవాలని ప్రయత్నిస్తున్నారు.. ఈ అక్కాతమ్ముళ్లు. నర్మెట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే ఎలగందుల అపర్ణ, ఏడో తరగతి చదివే ఎలగందుల మనోజ్‌లు ఆదివారం అనుబంధ ప్రత్యేక సంచిక రాగానే ఒకరు పదవినోదం, మరొకరు పత్రికలోని హాయ్‌బుజ్జీ కథలను తీసుకుంటారు. పాఠశాలలో ప్రతినెలా నిర్వహించే బాలసభలో వీటిని చదివి వినిపిస్తుంటారు. ఇద్దరు ఈ తరహా కథనాలను చెరో వంద వరకు కత్తిరించి, ఒక పుస్తకం రూపంలో రూపొందించారు. వీటిని బడిలోని గ్రంథాలయంలో భద్రపరిచి, మిగతా విద్యార్థులకు అందుబాటులో తేస్తామని వారు చెబుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్:80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

కొడకండ్ల: కొడకండ్ల-మొండ్రాయి ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి, ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. - శ్రీహరి, రామవరం

సమాధానం: త్వరలో చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతాం. - ప్రవీణ్, ఆర్‌అండ్‌బీ అధికారి

మురుగు కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

నర్మెట్ట, న్యూస్‌టుడే: మండలంలోని మచ్చుపహాడ్ 6వ వార్డులో మురుగు కాలువ వ్యర్థాలతో నిండి దుర్గంధం రావడంతో సమస్యను కాలనీ వాసులు మేమున్నాం మీకు తోడుగాకు తెలిపారు. 'న్యూస్‌టుడే' ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి వంశీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి సిబ్బందితో శుభ్రం చేయించారు.

తరిగొప్పుల, న్యూస్‌టుడే: మండలంలోని అంకుషాపూర్ గ్రామం తొమ్మిదోవార్డులో మురుగు కాల్వ వ్యర్థాలతో నిండి దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు 'మేమున్నాం మీకు తోడుగా"కు తెలియజేశారు. ఈ విషయాన్ని న్యూస్‌టుడే గ్రామ కార్యదర్శి మహేందర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకులంగా స్పందించి, సిబ్బందితో వ్యర్థాలను తొలగించారు.

జఫర్‌గఢ్: ఉప్పుగల్లులోని పలు వీధుల్లో మురుగు కాల్వల్లో మట్టి, చెత్త చెదారం పేరుకుపోయి నీరు బయటికి పోవడం లేదని సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కార్యదర్శి స్పందించారు. శుక్రవారం సిబ్బందితో శుభ్రం చేయించారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి రెండో వార్డులో మురుగు కాల్వ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి దుర్వాసన రావడంతో కాలనీ వాసులు మేమున్నాం.. మీకు తోడుగాకు వివరించారు. సమస్యను వెంటనే పంచాయతీ కార్యదర్శి తిరునగరి శ్రీకాంత్‌కు తెలియజేయగా ఆయన స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు.

చేతి పంపునకు మరమ్మతులు




జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: మండలంలోని తమ్మడపల్లి(ఐ)లో చేతి పంపు మరమ్మతులకు గురి కావడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రాజేశ్, కారోబారు ఓంకారు దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించారు. శుక్రవారం మెకానిక్‌తో గ్రామంలో రెండు చోట్ల బోరింగ్‌లకు మరమ్మతులు చేశారు.

మహాసభల గోడప్రతులు ఆవిష్కరణ



జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 21, 22, 23 తేదీల్లో కొత్తగూడెంలో నిర్వహించనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇర్రి అహల్య, షబానా కోరారు. మహాసభలకు సంబంధించిన గోడప్రతులను శుక్రవారం జనగామలోని సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 21న జరగనున్న బహిరంగ సభకు మాజీ రాజ్యసభ సభ్యురాలు బృందాకారత్ హాజరవుతున్నట్లు చెప్పారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘం ప్రతినిధులు మోకు భవాని, కల్యాణి, రమాదేవి, అనిత, వరలక్ష్మి, నాజియా తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, చిత్రంలో కలెక్టర్ రిజ్వాన్‌బాషా, ఇతర అధికారులు

జనగామ, న్యూస్‌టుడే: చదువుతో పాటు విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఉద్బోధించారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే 68వ జిల్లా స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం వారు ప్రారంభించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ పింకేశ్‌కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కలెక్టర్, కడియం మాట్లాడుతూ.. జనగామ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందని, ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ దఫా బడ్జెట్లో రూ.380 కోట్లు కేటాయించారన్నారు. శుక్రవారం బాలురకు, శనివారం బాలికలకు పోటీలు నిర్వహిస్తారని నిర్వాహకులు ప్రకటించారు. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్ర స్థాయికి, ఆపైన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, డీసీఈబీ కార్యదర్శి చంద్రభాను, జిల్లా క్రీడల అధికారి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు..

జనగామ: గ్రూప్-3, గ్రూప్-2 పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ నుంచి దృశ్యమాధ్యమ సమీక్ష జరిగింది. జనగామ జిల్లా సచివాలయంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, ఏసీపీ పార్థసారధి, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్షలో పాల్గొన్నారు. నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్3 పరీక్షలు, డిసెంబరు 15, 16న నిర్వహించే గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు రాష్ట్ర కమిషన్ ఛైర్మన్ పలు సూచనలు చేశారు. ప్రశ్నిపత్రాల భద్రతకు జిల్లా సచివాలయంలో స్ట్రాంగురూం ఏర్పాటు చేశామని వివరించారు.

బీటీ రోడ్డు మంజూరుకు వినతి



బచ్చన్నపేట, న్యూస్‌టుడే: బచ్చన్నపేట మండల కేంద్రం నుంచి ఎద్దుగూడెం, కేసిరెడ్డిపల్లి నుంచి బోనకొల్లూరుకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని కాంగ్రెస్ మండల నాయకులు, ఆయా గ్రామస్థులు హైదరాబాద్‌లోని డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి, మంజూరు చేయిస్తానన్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకటచారి, హరీశ్, వెంకటేశ్, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, న్యూస్‌టుడే: గురుకులాల్లో సౌకర్యాల మెరుగునకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, ప్రభుత్వ సంకల్పాన్ని విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల, మైనార్టీ పాఠశాలలో శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, వంటగదులు, తదితర సౌకర్యాల నిర్వహణపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనం అందించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రామచంద్రయ్య, ఉపఛైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సోమరాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ ప్రాబల్యంతో కేసులు నిర్వీర్యం'



రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

జనగామ, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం ప్రకారం నమోదైన కేసుల్లో అరెస్టులు లేకపోవడంతో చట్టం నిర్వీర్యమవుతోందని, రాజకీయ ప్రాబల్యం, మధ్యవర్తుల ప్రమేయంతో కేసులతో ఉపయోగం లేకుండా పోతోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాగల్ల ఉపేందర్ మాదిగ ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ ఛైర్మన్ శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో పాల్గొని పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి, వినతిపత్రం సమర్పించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. దళితుల భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు జి.కిషోర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్, నేతలు రవీందర్, నిర్మాల భాస్కర్, గువ్వల రవి, తుర్కపల్లి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు



ఖిలాషాపురంలో నియంత్రిక

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఖిలాషాపురంలో విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారింది. బీఎస్ఎన్ఎల్ టవర్ కోసం 25 కేవీ నియంత్రికను నెలకొల్పారు. వర్షం పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'ఎల్‌టీ లైన్ ఏర్పాటు చేయండి'

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి(జి)లోని 9 వార్డుల్లో ఎల్‌టీ లైన్ ఏర్పాటు చేయాలని సీపీఎం గ్రామ కార్యదర్శి వడ్డకొండ సుధాకర్ అన్నారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఈకి శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. అంతకుముందు విద్యుత్తు కార్యాలయం ఎదుట గ్రామస్థులతో కలిసి ఆందోళన నిర్వహించారు. కొన్నేళ్లుగా ఇళ్లకు విద్యుత్తు సరఫరా లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు యాకయ్య, పెద్దరాములు, రజిత, శంషోద్దిన్, ఎల్లయ్య, సోమయ్య, ప్రభాకర్, మల్లమ్మ, షబానా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జఫర్‌గఢ్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం పరామర్శించారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ కరుణాకర్‌రావు, నాయకులు మంచాల ఎల్లయ్య, భిక్షపతి, అయిలయ్య, గుజ్జరి రాజు, కనకయ్య, అయోధ్య, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేటలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా డీఆర్‌డీవో వసంత, డీపీఎం వరలక్ష్మీ పరిశీలించారు. రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర చెల్లిస్తోందన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుమన్, ఏపీఎం రవీందర్, సీసీలు నర్సింగం, కుమార్, సహదేవ్ మహిళ సమైక్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

జఫర్‌గఢ్: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, హైదరాబాద్‌లో అమలు చేస్తున్న హైడ్రాను అన్ని జిల్లాలకు విస్తరింపజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అన్నారు. జఫర్‌గఢ్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా ద్వారా ప్రభుత్వ భూములను వెలికి తీయడం హర్షణీయమన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో చెరువు, కుంటల్లో అక్రమంగా నిర్మాణం చేసిన ఇళ్లను తొలగించాలని కోరారు. పేదలకు అన్యాయం చేస్తే ఎర్రజెండాలతో తిరుగుబాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సాయన్న, మండల కార్యదర్శి రమేశ్, నాయకులు యాకుబ్‌పాషా, చంద్రమౌళి, దూడయ్య, బుచ్చయ్య, సత్తయ్య, జాఫర్, వెంకటయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్, తాటికొండ విద్యుత్తు కేంద్రాల్లో మరమ్మతుల కారణంగా నేడు (శనివారం) ఆయా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పి.శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బహుమతుల అందజేత



లింగాలఘనపురం: జిల్లా స్థాయి కళా ఉత్సవం కార్యక్రమంలో శుక్రవారం మండలంలోని చీటూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు అయిత నర్సింహులు తెలిపారు. సంప్రదాయ కథల పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని సీహెచ్.అలేఖ్య (ప్రథమ) స్వర సంగీతం విభాగంలో 8వ తరగతి విద్యార్థిని వి.దీక్షిత(ద్వితీయ) బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్థులు విద్యార్థులను అభినందించారు.

మహాసభలను విజయవంతం చేయండి

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం నాలుగో రాష్ట్ర మహాసభలను ఈ నెల 21 నుంచి 23 వరకు కొత్తగూడెంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ షబానీ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అఖిల భారత ప్రజాతంత్ర (ఐద్వా) మహిళ సంఘం మహాసభ కొత్తగూడెంలో నిర్వహిస్తున్నారని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన అవసరం

స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియపై పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కుడా ఏపీవో(అడిషనల్ ప్రోగ్రాం అధికారి) రవీందర్ అన్నారు. ఘన్‌పూర్, చిల్పూర్ మండలాలల్లోని పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం ఎల్‌ఆర్‌ఎస్ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి.. చరవాణిలో దరఖాస్తుల అప్‌లోడ్ తదితర అంశాలను వివరించారు. స్థలాల క్రమబద్ధీకరణలో మార్గదర్శక సూత్రాలను అనుసరించి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయశ్రీ, ఎంపీవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని శివునిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కుసుమ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. 19, 20 తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ ఛైర్ పర్సన్ లావణ్య

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను దళారులకు విక్రయించి మోసపోవద్దని మార్కెట్ ఛైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య సూచించారు. మండలంలోని శివునిపల్లిలో శ్రీ శివసాయి కాటన్ ఇండస్ట్రీస్‌లో ప్రభుత్వ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస మద్దతు ధర లభిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి జన్ను భాస్కర్, కేంద్రం ఇన్‌ఛార్జి తిరుపతిరెడ్డి, మనోహర్, వైస్ ఛైర్మన్ ఐలయ్య, డైరెక్టర్లు కిరణ్, కుమారస్వామి, నాయకులు శిరీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరందించడమే లక్ష్యం



కొడకండ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు సురక్షిత తాగునీరందించడమే ధ్యేయంగా పంచాయతీ సిబ్బంది విధులు నిర్వర్తించాలని మిషన్‌భగీరథ ఈఈ శ్రీకర్ తెలిపారు. కొడకండ్లలో గత మూడు రోజులుగా పంచాయతీల వాటర్‌మెన్‌లకు నిర్వహించిన శిక్షణ ముగింపు సమావేశానికి ఆయన హాజరై, లీకేజీల గుర్తింపు, మరమ్మతు, పరిశుభ్రత తదితర అంశాలపై సమగ్ర శిక్షణనందించారు. అనంతరం వాటర్‌మెన్‌లకు శిక్షణ ధ్రువపత్రాలందించారు. సమావేశంలో ఎంపీడీవో శేషాద్రిసూరి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపక కమిటీ ఏర్పాటు

జనగామ, న్యూస్‌టుడే: స్థానిక ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతిథి(గెస్ట్) అధ్యాపకుల కమిటీని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు జి. మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షుడు ఆర్.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులుగా వై.గణేశ్, ఎన్. నర్సింలు, ఎం.వెన్నెల, ఎన్. మౌనికలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలు సంభవించకుండా చర్యలు



శివునిపల్లిలో పత్తి మిల్లును పరిశీలిస్తున్న అగ్నిమాపక అధికారి దేవేందర్

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: పత్తి మిల్లులో త్వరలో పత్తి కొనుగోలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు సంభవించకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ అగ్నిమాపక అధికారి ఎన్. దేవేందర్ సూచించారు. మండలంలోని శివునిపల్లిలోని పత్తి మిల్లును శుక్రవారం సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సురేందర్, గణేష్ పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారుల నియామకం



దివ్య



విక్రమ్‌రావు

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: దేవరుప్పుల మండల వ్యవసాయాధికారిగా బజ్జూరి దివ్య శుక్రవారం ఆమె కార్యాలయంలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ.. మండలంలో వ్యవసాయం, ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించడానికి తగు సహకారం అందిస్తానని, రైతులకు ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

తరిగొప్పుల: తరిగొప్పుల మండల వ్యవసాయాధికారిగా పెచెట్టి మనోహిత్ విక్రమ్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నర్మెట్ట మండల వ్యవసాయాధికారిని తరిగొప్పులకు ఇన్‌ఛార్జి ఏవోగా నియమించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారుల పోస్టులను భర్తీ చేయగా, విక్రమ్‌రావును మండలానికి కేటాయించారు.

సృజనాత్మకతతో విద్యార్థుల్లో నైపుణ్యం



కళా ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. జనగామ పట్టణంలోని ఏకశిల విద్యా కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కళా ఉత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళా ఉత్సవ్ వంటి కార్యక్రమాలు సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థుల్లో పోటీ తత్వం పెరిగి నూతన విషయాలు ఆవిష్కృతమవుతాయన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాము మాట్లాడుతూ.. ఈ పోటీల్లో గాత్ర సంగీతం, వాయిద్యం, నృత్యం, థియేటర్, విజువల్ ఆర్ట్స్, సంప్రదాయక కథ చెప్పడం వంటి విభాగాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారు జిల్లా స్థాయిలో పాల్గొంటున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయి విజేతలు హైదరాబాద్‌లో నవంబర్ 1, 2 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాస్, డీసీఈబీ కార్యదర్శి చంద్రభాను, న్యాయనిర్ణేతలుగా మల్లికార్జున్, వీరంజని, రామరాజు వ్యవహరించారు.

అడ్వాన్స్‌డ్ కోర్సులతో ఉపాధి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఐటీఐల ద్వారా అందిస్తున్న సత్వర ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏటూరునాగారం ఆర్ఐటీఐ ప్రిన్సిపల్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వరంగల్ ఉపాధి, శిక్షణ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకుడు సీతారాములు విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల ప్రాధాన్యంపై వివరించారు. కార్యక్రమానికి వాజేడు ఐటీఐ ప్రిన్సిపల్ శేఖర్, కాజీపేట ఐటీఐ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.